క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ

సోమశిల: అనంతసాగరంలోని సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని, ధాన్యం కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. రైతులకు ధాన్యం తరలించేందుకు ఉచితంగా గోనె సంచులు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులకు ఉత్తరక్రియల ఖర్చుల నిమిత్తం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. 11వ వార్డు పరిధిలోని ఉత్తర బలిజవీధికి చెందిన పులి దుర్గాప్రసాద్, 22వ వార్డు పరిధిలోని పేరారెడ్డిపల్లికి చెందిన గంగవరపు కొండమ్మ ఇటీవల మృతి చెందారు. శనివారం ట్రస్ట్ నిర్వాహకులు ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, కేవీ శేషారెడ్డి, అచ్చోలు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీకేపాడు ఇసుక రీచ్ పరిశీలన



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది

సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు ఇసుక రీచ్‌ను శనివారం తహసీల్దారు నరసింహారావు ఆత్మకూరు సెబ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలపై నివేదికను తయారు చేసి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ గిరీష్, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సోమశిల: అనంతసాగరం మెయిన్ రోడ్డు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరఫున నెల్లూరు ఎంపీగా వీ విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలంటూ విజ్ఞప్తి చేస్తూ ప్రచారం చేశారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు తదితరులు ఉన్నారు.

ఇంటింటికి ముమ్మర ప్రచారం



22వ వార్డులో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ఆత్మకూరు: 'నేను సైతం' అనే నినాదంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరిని సమాయత్త పరిచే క్రమంలో భాగంగా పట్టణంలో పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ నిర్వాహకులు శనివారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. 7, 17, 22 వార్డుల పరిధిలోని క్లస్టర్ల నిర్వాహకులు కార్యకర్తలతో కలిసి జగనన్న సందేశం, ఆత్మకూరు అభివృద్ధి కోసం నేను సైతం అనే కరపత్రాలను పంపిణీ చేశారు. అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కావ్య టిప్పర్ల వల్లే రోడ్లు ధ్వంసం

- అడిగితే బెదిరించారని కోళ్లదిన్నె వాసుల ఆరోపణ
- ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



కావలి: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కోళ్లదిన్నె గ్రామస్తులు

కావలి: కావలి తీర ప్రాంతం రోడ్లన్నీ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి టిప్పర్ల వల్లనే ధ్వంసం అయ్యాయని మండలంలోని కోళ్లదిన్నె గ్రామస్తులు ఆరోపించారు. గ్రావెల్, కంకర టిప్పర్ల కారణంగా రోడ్లు ధ్వంసమతున్నా పట్టించుకోకుండా గ్రామస్తులను బెదిరించి యథేచ్ఛగా నాశనం చేశారని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తి ప్రజాప్రతినిధిగా వస్తే ఇక ఊళ్లే నాశనం అవుతాయని ఆ గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. కావ్య టిప్పర్ల కారణంగా ధ్వంసమైన రోడ్లను ఎమ్మెల్యే చొరవ తీసుకుని మరమ్మతులు చేయించారని గుర్తు చేశారు. కావ్య కృష్ణారెడ్డి కారణంగా గ్రామాలు నాశనమవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన అనుచరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యేను కోరారు. వారు మాట్లాడుతూ కావ్య కృష్ణారెడ్డికి చెందిన టిప్పర్ల కారణంగా తమ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. పలుమార్లు టిప్పర్లు నిలిపేసినా పట్టించుకోకుండా కేసులు పెడుతామని బెదిరించి ఇష్టారాజ్యంగా టిప్పర్లు తిప్పారని వాపోయారు. దీంతో కావలి నుంచి తమ గ్రామానికి వెళ్లాలంటే గంటకు పైగా సమయం పట్టేదన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పందించి రోడ్డు వేయించడంతో కష్టాలు తప్పాయన్నారు. ఇప్పుడు 15 నిమిషాల్లోనే తమ గ్రామానికి చేరుకోగలుగుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తమ గ్రామమంతా ప్రతాప్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలుస్తాందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే పేదల బతుకులకు భరోసా లభిస్తుందన్నారు. తనను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోండి



పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- అల్లూరులో అత్యధిక మెజార్టీని జగనన్నకు కానుకగా ఇవ్వండి
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను అల్లూరు మండల నాయకులు, కార్యకర్తలు ఛాలెంజ్‌గా తీసుకుని సమష్టిగా కష్టపడి పనిచేసి నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. అల్లూరులో పార్టీ నేతలతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండల నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మేలో జరగనున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పేదల పక్షాన ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పెత్తందారుల పక్షాన ఉన్న చంద్రబాబుకు మధ్య అని అన్నారు. పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల కాలంలో జనరంజక పాలన చేసి చూపించారన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసింది ఏమి లేకపోవడంతో, ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేసి ఓట్లు పొందాలను కుట్రలు పన్నుతున్నాడన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు భేషజాలకు పోకుండా పట్టుదలతో సమష్టగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. విష ప్రచారాలు, డబ్బులతో ప్రలోభాలు, చెక్‌లు ఇచ్చి పోలింగ్ అయిన తర్వాత నగదు జమయ్యే ఏర్పాట్లు చేస్తామంటూ ఇలా పలు రకాల గారడీలతో ఎన్నికల్లో లబ్ధిపొందాలనుకునే వారి నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. టీడీపీ అధికారం ఉన్నప్పుడు కులాల మధ్య చిచ్చు, ముఖ్యంగా మత్స్యకారుల నడుమ ఘర్షణలు సృష్టించి రాజకీయాలు చేసే వారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇలాంటి నీచమైన దుష్ట సంస్కృతిని శాశ్వతంగా అరికట్టి పల్లెలు ప్రశాంతంగా ఉండేలా చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పార్టీని వీడి వెళ్లిన ద్రోహులను మళ్లీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని, పార్టీలో కష్టపడి పని చేసి వారందరిని నా కుటుంబ సభ్యులుగా చూసుకుంటానన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేణుబాక విజయసాయిరెడ్డికి అత్యధిక మెజార్టీ అందించడం ద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు.

కావ్య.. ఇక కాస్కో: మన్నెమాల

టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి నోటికి వచ్చినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని దూషిస్తున్నాడని, నోటిని అదుపులో పెట్టుకోకపోతే ఆయన భాషలోనే ఆయనకు బుద్ధి చెబుతామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కందుకూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి హెచ్చరించారు. కావ్య కృష్ణారెడ్డిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రజలే తమల్ని నిలదీస్తున్నారన్నారు. తమ పార్టీ నాయకులు ఎక్కడికక్కడ కావ్యకు సరైన రీతిలో సమాధానం చెబుతారన్నారు. ఇక నుంచి తమ పార్టీ నాయకులతో ఎదుర్కోవడానికి కాస్కోవాలని కావ్యకి సవాల్ విసిరారు. బూటకపు మాటలు వల్లి వేసే కావ్య రెచ్చగొట్టే మాటలు చెబుతూ పబ్బం గడుపుకోవాలని క్షుద్రపూజలు చేస్తున్నాడన్నారు. కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చరిత్ర సృష్టిస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, మేడా రామకృష్ణారెడ్డి, కరేటి దైవాదీనం, సామంతుల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన రేపు

మర్రిపాడు: మండలంలోని రాజుపాళెంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థాన పునః నిర్మాణానికి ఈ నెల 25న ఉదయం 9 గంటలకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు దేవస్థాన గ్రామ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి 132/33 కేవీ ఉప విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆది, సోమవారాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఉడతా మన్మథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: మండలంలోని తూర్పుఎర్రబల్లిలో శనివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర సందర్భంగా వెలిగండ్ల పంచాయతీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజగోపాల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ టి కామేశ్వరి శనివారం తెలిపారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె వివరించారు. ఏప్రిల్ 25న ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోషణ్ పక్వాడా వారోత్సవాలు



పోషణ్ పక్వాడా నిర్వహిస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లి, గౌరవరం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. కచిరిదేవరాయపల్లి అంగన్‌వాడీలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అవసరమయ్యే పోషక పదార్థాలపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వస్తువుల్లో పోషకాలతో కూడిన పదార్థాలు లబ్ధిదారులకు ఇస్తున్నామన్నారు. పాలు, గుడ్లు వాటిలో పోషక పదార్థాలు ఎక్కువగా ఉంటాయని, క్రమం తప్పకుండా వాటిని ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారద, నాగమణి, అంగన్‌వాడీ వర్కర్లు రమ, ప్రమీల, లక్ష్మి, నిర్మల, మదనిక లబ్ధిదారులు పాల్గొనారు.

వైభవంగా గరుడోత్సవం

- కిక్కిరిసిన బిలకూట క్షేత్రం



గరుడ వాహనంపై ప్రసన్నుడి దివ్య రూపం

బిట్రగుంట: బిలకూట క్షేత్ర వాసి ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడ, గజ వాహన సేవలతో పాటు పుష్కరిణిలో జలవిహారోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు, ఆపద సమయాల్లో స్వామివారికి వరపడిన భక్తులంతా బ్రహ్మోత్సవాల్లో సమారాధనల పేరిట మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీ. శనివారం వేకువజామున గరుడ సేవ జరిగింది. సాయంత్రం భక్తుల గోవింద నామస్మరణల మధ్య వేదపండితులు ఉభయ దేవేరులను, స్వామివారిని కొండ దిగువన ఉన్న పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. జలవిహారంతో భక్తులను ఆధ్యాత్మిక డోలికల్లో ఓలలాడించారు.

గజవాహనంపై ప్రసన్నుడు

అనంతరం ప్రసన్న వెంకటేశ్వరుడు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, జయజయధ్వానాల మధ్య గజవాహనంపై ఊరేగారు. ఈ ఘట్టం నేత్రపర్వంగా సాగింది. భక్తులు శ్రీవారి ఉత్సవ సేవలో తన్మయులు అయ్యారు.



ఉభయదేవేరులతో జలవిహారం చేస్తున్న ప్రసన్నుడి వైభవాన్ని వీక్షిస్తున్న భక్తులు

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



మేకపాటికి పూలమాలతో సత్కరిస్తున్న మహిళలు

- గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని తూర్పుఎర్రబల్లి పంచాయతీలో శనివారం విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. మహిళలు బొట్టు పెట్టి హారతులిచ్చారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కలిసికట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలకు వివరించాలన్నారు. తప్పుడు హామీలతో చంద్రబాబు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ రావాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైనాట్ 175 దిశగా జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలల రూపు రేఖలు మారాయన్నారు. ప్రతి పేద కుటుంబానికి కార్పొరేట్ వైద్యంతో పాటు వారి పిల్లలకు కూడా కార్పొరేట్ విద్యను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రైతులకు, మహిళలకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. కూటమి పేరుతో వస్తున్న తోక పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల తర్వాత అమెరికా వెళ్లిపోతాడని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏడాదిలో నాలుగు రోజులు కూడా అందుబాటులో ఉండరన్నారు. సీఎం జగన్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని పార్టీ నాయకులను కోరారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రతి కార్యకర్తకు సేవకుడిగా ఉంటానన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ యల్లావుల వెంకట్రావు, నాయకులు పిన్నిక కొండయ్య, బసిరెడ్డి రాఘవరెడ్డి, ఉండేల చంద్రశేఖర్, ఉండేల నాగిరెడ్డి, ఎం. మురళీ, చినకొండయ్య, స్థానిక సర్పంచ్ ఏసమ్మ, ఎంపీటీసీ హైమావతి, చంద్ర, మాధవరెడ్డి, పి. కమలాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ నిబంధనలు పాటించాల్సిందే

- ఆర్డీఓ కె మధులత
- మద్యం, కల్యాణ మండపాలు పరిశీలన



ఆత్మకూరు మద్యం దుకాణంలో పరిశీలించి రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, సిబ్బంది

ఆత్మకూరు: సాధారణ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న క్రమంలో నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఆత్మకూరు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కె మధులత అన్నారు. పట్టణంలోని కల్యాణ మండపాలు, మద్యం దుకాణాలను ఆమె శనివారం పరిశీలించారు. ఆర్ఓ అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహించుకునేందుకు కల్యాణ మండపాల యజమానులు అనుమతించకూడదన్నారు. సదరు కల్యాణ మండపాల యజమానులు అందరూ ఈ విషయాన్ని గుర్తించి నిబంధనలు అతిక్రమించొద్దన్నారు. మద్యం దుకాణాల్లో బల్క్ ఆర్డర్ (ఎక్కువ మొత్తంలో) ఎవరికి మద్యం విక్రయించరాదని, దుకాణాల సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. పాన్‌బ్రోకర్ దుకాణాల్లో పెద్ద మొత్తంలో బంగారు వస్తువులు కుదువ పెట్టుకుని నగదు ఇవ్వరాదని ఆదేశించారు. తరచూ ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ స్క్వాడ్ దుకాణాలను తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఆమె వెంట ఆర్ పృథ్వీ, వీఆర్‌ఓలు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



ఆత్మకూరులోని స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వివరాలను బహిర్గతం చేయడం తీవ్ర నేరమని డివిజనల్ మెడికల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శనివారం పీడియాట్రిక్స్ డాక్టర్ దినకర్, పీహెచ్‌సీ డాక్టర్ అనూషతో కలిసి ప్రోగ్రామ్ అధికారి సుధీర్‌కుమార్ స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. ఇటీవల జరిగిన పరీక్షల రికార్డులను తమకు అందిన నివేదికలను సరిపోల్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఆ నివేదికలను ఎట్టి పరిస్థితుల్లోనూ బహిర్గతం చేయరాదన్నారు. కేవలం గర్భంలోని శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే పరీక్షలను కొందరు బహిర్గతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆస్పత్రుల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



మర్రిపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సీతారామపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మర్రిపాడు: ప్రపంచ క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. మర్రిపాడు వైద్యాధికారి గోపినాథ్ మాట్లాడుతూ క్షయ నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. టీబీని అంతం చేద్దాం, సమాజం నుంచి తరిమేద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో మనవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగహన ర్యాలీ

సీతారామపురం (ఉదయగిరి): ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంలో భాగంగా శనివారం బస్టాండ్ సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు క్షయ వ్యాధిపై అవగహన కల్పిస్తూ వివిధ కరపత్రాలు ప్రదర్శిస్తూ వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. వైద్యాధికారిణి స్వప్న మాట్లాడుతూ క్షయవ్యాధి సోకిన వారికి పోషకాహారం నిమిత్తం ప్రభుత్వం ప్రతి నెల రూ.500 చొప్పున ఆరు నెలల ఇస్తోందన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మజీద్, కృష్ణమ్మ, రియాజ్, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

క్రికెట్ మ్యాచ్‌లో వివాదం

- 16 మందిపై కేసు నమోదు



గ్రామంలో విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి

మర్రిపాడు: మండలంలోని తిక్కవరం గ్రామంలో శుక్రవారం క్రికెట్ మ్యాచ్ వద్ద వివాదం చోటుచేసుకుంది. దీంతో రాత్రి బద్వేల్ నుంచి ఒక వర్గం కార్లలో కొంతమందిని తీసుకొచ్చి కార్తీక్ అనే యువకుడి ఇంట్లో చొరబడి దాడి చేశారు. అడ్డు వచ్చిన వారిపై కూడా దాడి చేయడంతో నలుగురికి తీవ్రగాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వీరిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ వేణు, ఎస్సై విశ్వనాథరెడ్డి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. 16 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.